సాక్షి
వైఎస్సార్ జిల్లా

సోమవారం । 16 । అక్టోబర్ । 2023



హోరాహోరీగా హ్యాండ్‌బాల్ పోటీలు

కడపలోని డీఎస్ఏ మైదానంలోజరుగుతున్న హ్యాండ్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. -8లో



సమావేశంలో ఉద్రిక్తత

కురబ సంఘం రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక వ్యవహారం ఉద్రిక్తతకు దారితీసింది. ఆదివారం హార్సిలీ హిల్స్‌లో ఈ సంఘటన చోటు చేసుకుంది. -8లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
35.7/25.4

జిల్లాలో ఆదివారం 25.4 - 35.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

19న పండ్ల తోటల రాష్ట్ర సదస్సు

కడప వైఎస్ఆర్ సర్కిల్: పండ్ల తోటల రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 19వ తేదీన తాడిపత్రిలో అరటి చీని బొప్పాయి మామిడి నిమ్మ రైతుల రాష్ట్ర సదస్సును నిర్వహిస్తున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి తెలిపారు.ఆదివారం రైతు సంఘం జిల్లా కార్యాలయంలో ఇందుకు సంబంధించిన కరపత్రాల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రిప్పు ,స్ప్రింక్లర్లను 90 శాతం సబ్సిడీతో రైతులకు అందించాలన్నారు. మామిడి బత్తాయి అరటి పండ్ల తోటల రైతులకు మద్దతు ధర నిర్ణయించాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాలకష్ణయ్య, నాయకులు చిన్న సిద్దయ్య శికామణి తదితరులు పాల్గొన్నారు.

21న ప్రత్యేక లోక్ అదాలత్



కడప అర్బన్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారి ఆధ్వర్యంలో ఈనెల 21న ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక లోక్ అదాలత్ జరగనుంది. మోటార్ వాహనాల ప్రమాదాలకు సంబంధించిన కేసులు (ఎంవీఓపీ కేసులు), రెవెన్యూ కేసులు మాత్రమే రాజీ చేసుకోవచ్చన్నారు. మరింత సమాచారం కోసం 08562- 258622, 244622, ఈమెయిల్ అడ్రస్: డిస్ట్రిక్ట్.ఈకోర్ట్స్.జీఓవి.ఐఎన్/కడప, డీఎల్ఎస్ఏకేడీపీ అట్‌దిడేటాఫ్ జీమెయిల్ డాట్ కామ్‌లో సంప్రదించాలన్నారు. కక్షిదారులు పైన తెలిపిన విషయాలకు సంబంధించిన కేసులు రాజీ చేసుకుని సత్వర న్యాయం పొందవచ్చునని జిల్లా ప్రధానన్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్మన్ జి. శ్రీదేవి, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జి సెక్రటరీ, జడ్జి ఎం. ప్రదీప్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సులు



మదనపల్లె సిటీ: అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెలో వెలసిన శ్రీ భమరాంభిక సమేత మల్లికార్జునస్వామి మల్లయ్యకొండకు సోమవారం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ వన్ డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మదనపల్లె డిపో నుంచి ఉదయం 5, 6.30 గంటలకు బస్సులు బయలుదేరుతాయన్నారు. తంబళ్లపల్లె నుంచి మల్లయ్యకొండకు సాయంత్రం వరకు షటిల్ బస్సులు తిరుగుతాయన్నారు. భక్తులు ఆర్టీసీ బస్సులో ప్రయాణించాలని కోరారు.

ఫుట్‌బాల్ క్యాంపు ప్రారంభం

మదనపల్లె సిటీ: దసరా సెలవులను పురస్కరించుకుని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం అన్నమయ్య జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్పెషల్ ఫుబాల్ క్యాంపు ప్రారంభమైంది. సుమారు 40 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతి రోజు ఉదయం,సాయంత్రం క్రీడాకారులకు ఆటకు సంబంధించి మెలకువలు నేర్పిస్తామన్నారు. ఈనెల 22 వరకు క్యాంపు జరుగుతుందని అసోసియేషన్ కార్య నిర్వాహకులు మురళీధర్, దిలీప్, సాగర్ తెలిపారు. చివరి రోజు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసామన్నారు.

అంబరమంటిన సంబరం



ప్రొద్దుటూరు: రాజరాజేశ్వరిదేవిగా కన్యకాపరమేశ్వరి



ప్రొద్దుటూరు: కలశాలను తీసుకువస్తున్న ఆర్యవైశ్య మహిళలు



కడప: శైలపుత్రిగా విజయదుర్గాదేవి

- ఘనంగా ప్రారంభమైన దసరా ఉత్సవాలు
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన కర్ణాటక డొల్లుకునిత నృత్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : దసరా మహోత్సవాల నిర్వహనలో రెండో మైసూరుగా పేరుగాంచిన ప్రొద్దుటూరు పట్టణంలో ఆదివారం ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు.కలశాలతో గ్రామోత్సవం నిర్వహించారు. 102 మంది ఆర్యవైశ్య సుహాసినులు అగస్త్యేశ్వర స్వామి ఆలయం నుంచి కలశాలలో నింపిన నవగంగ తీర్థాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి అభిషేకం జరిపారు. అనంతరం కన్యకాపరమేశ్వరిదేవి ఆలయం నుంచి మంగళవాయిద్యాలతో, బాణసంచా పేలుళ్లతో ఊరేగింపుగా బయల్దేరి తెల్లాకుల శివయ్యగారి నగరేశ్వరస్వామి దేవస్థానం నుంచి శ్రీకన్యకాపరమేశ్వరిదేవి పురాణాన్ని తీసుకురావడంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. కర్ణాటకకు చెందిన కళాకారుల డొల్లుకునిత నృత్య ప్రదర్శన, నాగ్‌పూర్ చెందిన సుయోగ్ బ్యాండ్ అందరినీ ఆకట్టుకుంది. చెన్నకేశవస్వామి ఆలయ ఉత్సవ కమిటీ వారు ఊరేగింపుగా పాత బస్టాండ్ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేసి కలశాన్ని తీసుకెళ్లారు. రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ వారు శివాలయంలో ప్రత్యేక పూజలు జరిపి దసరా ఉత్సవాలను ప్రారంభించారు. శివాలయంలోని రాజరాజేశ్వరి ఉత్సవ కమిటీ, వారు దసరా ఉత్సవాల ప్రారంభోత్సవం సందర్భంగా కలశపూజ చేసి గ్రామోత్సవం చేశారు. శాస్త్రీనగర్‌లోని రాజరాజేశ్వరిదేవి ఆలయ నిర్వాహకులు కలశపూజ, గ్రామోత్సవాలను వైభవంగా జరిపారు.

- వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లోని ఆలయాల్లో అమ్మవారు వివిధ అలంకారాల్లో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని తరించారు.



పోరుమామిళ్ల: రాజరాజేశ్వరీదేవిగా అమ్మవారు



రాయచోటి టౌన్: భద్రకాళి నమోస్తుతే..



దసరా వేడుకల్లో ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు రామ్మోహనరావు, తదితరులు



ప్రొద్దుటూరు: కర్ణాటక కళాకారుల నృత్య ప్రదర్శన



ప్రొద్దుటూరు: మహిళల తప్పెట్ల సందడి



ప్రొద్దుటూరు: నాగపూర్‌కు చెందిన సుయోగ్ బ్యాండ్

ప్రొద్దుటూరులో యాత్ర-2 సినిమా షూటింగ్

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం 'యాత్ర-2' సినిమా షూటింగ్ చేశారు. కొర్రపాడు రోడ్డు, శ్రీనివాసనగర్, రాజీవ్ సర్కిళ్లలో సినిమా హీరో జీవాపై పలు సన్నివేశాలను చిత్రీకరించారు. హీరో వాహనంపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తూ వస్తున్న సన్నివేశం, మాట్లాడుతున్న దృశ్యాలను షూటింగ్ చేశారు. షూటింగ్ చూడటానికి జనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. షూటింగ్‌లో చిత్ర డైరెక్టర్ మహి వీ రాఘువ, నిర్మాత శివ మేక పాల్గొన్నారు.



హీరో జీవా ప్రసంగిస్తున్న సన్నివేశం

ఒంటిమిట్ట చెరువుకు సోమశిల వెనుకజలాలు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట చెరువుకు మళ్లీ సోమశిళ వెనుకజలాలు వచ్చాయి. చెరువులోకి బ్యాక్‌వాటర్‌ను ఎమ్మెల్యే మేడామల్లికార్జునరెడ్డి ఆదివారం విడుదల చేశారు. కుడమలూరు వద్ద పంప్ హౌస్ నుంచి నీరు విడుదల చేశారు.అంతకుముందు పూజలు నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవ తీసుకొని సంబంధిత పంప్‌హౌకు రూ.50లక్షల మంజూరు చేశారన్నారు. నీటి విడుదల విషయం కలెక్టర్ తీసుకెళ్లినట్లు చెప్పారు. తాను సీఎంను కలిసి ఒంటిమిట్ట చెరువు ఎండిపోతోందని, మళ్లీ నీటిని విడుదల చేయాలని కోరామన్నారు. రెండు పైప్‌లైన్ కోసం ప్రతిపాదనలు పంపంచామన్నారు. మంజూరైన వెంటనే పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, ఒంటిమిట్ట మండల కన్వీనర్ గజ్జల శ్రీనివాసులరెడ్డి, ఒంటిమిట్ట చెరువు కమిటీ చైర్మన్ ఆకేపాటి శివారెడ్డి, పెన్నపేరూరు ఎంపీటీసీ ముమ్మడి నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.



నీటి విడుదల సందర్భంగా పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

పురస్కార ప్రదానం అదృష్టంగా భావిస్తున్నా

డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కల్చరల్ : ఒక గొప్ప కథకుని పేరిట జీవిత సాఫల్య పురస్కారాన్ని మరో గొప్ప రచయితకు అందించే అవకాశం నాకు లభించడం నిజంగా అదృష్టంగా భావిస్తున్నానని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా పేర్కొన్నారు. కవిత విద్యా సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షులు అలపర్తి పిచ్చయ్యచౌదరి ఆధ్వర్యంలో ఆదివారం కడప నగరం ఐఎంఏ హాలులో సాహిత్య సభ నిర్వహించారు. ప్రసిద్ధ కథల మాస్టారు కేతు విశ్వనాథరెడ్డి పేరిట తొలి తెలుగు ముస్లిం కథకులు షేక్ హుసేన్ సత్యాగ్నికి ఆయన జీవిత సాఫల్య పురస్కారాన్ని అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ సీఎం అంజద్‌బాషా మాట్లాడుతూ రాజకీయ వేత్తలకు సాహిత్య సభలో మాట్లాడటం కాస్త ఇబ్బందేనని, కానీ కార్యక్రమ ఔన్నత్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ పురస్కార ప్రదానోత్సవానికి హాజరయ్యామన్నారు. తనకు ఆరాధ్యుడైన దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డిని పరిచయం చేసి రాజకీయంగా వెన్నుతట్టిన షేక్ హుసేన్ సత్యాగ్నికి పురస్కారం అందజేసే భాగ్యం లభించినందుకు సంతోషంగా ఉందన్నారు. షేక్ హుసేన్ తనకు గాడ్ ఫాదర్‌లాంటివారని, రాజకీయాలలో తనకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

- సభాధ్యక్షుడు ఆచార్య ఎస్.ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ కేతు విశ్వనాథరెడ్డి లాంటి దిగ్గజ రచయిత పేరిట జీవిత సాఫల్య పురస్కారాన్ని మరో గొప్ప రచయిత సత్యాగ్నికి ఇవ్వడం అరుదైన సందర్భమన్నారు.గౌరవ అతిథి డాక్టర్ పి.సంజీవమ్మ మాట్లాడుతూ తెలుగు కథకుల్లో ఎన్నదగిన ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి ప్రభావం నేటి రచయితలపై కనిపిస్తోందన్నారు. షేక్ హుసేన్ రచనల్లో వాస్తవికత ప్రశంసనీయమని కొనియాడారు. అనంతరం పిచ్చయ్య చౌదరి సంస్థ వార్షిక నివేదిక సమర్పించారు. జిల్లాలో సాహిత్య సృహ ఎక్కువేనని, ఆ ప్రభావంతోనే తాను రచనలు చేయగలిగామని తెలిపారు. ఆచార్యకేతు విశ్వనాథరెడ్డి జీవితం, సాహిత్యంపై రచయిత పాలగిరి విశ్వప్రసాద్, సత్యాగ్ని జీవితం-సాహిత్యంపై యువ రచయిత డాక్టర్ వేంపల్లె షరీఫ్‌లు ప్రసంగించారు. ఆ ఇద్దరు రచయితలకు గల సామ్యాన్ని, రచనల విశిష్టతలను సోదాహరణంగా వివరించారు.



షేక్ హుసేన్ సత్యాగ్నికి పురస్కారం అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా

పురస్కార ప్రదానం

అనంతరం కార్యక్రమ నిర్వాహకులు అలపర్తి పిచ్చయ్యచౌదరి ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా షేక్ హుసేన్ సత్యాగ్నికి డాక్టర్ కేతు విశ్వనాథరెడ్డి పేరిట జీవిత సాఫల్య పురస్కారాన్ని అందజేశారు. శాలువ, పూలమాల, జ్ఞాపిక, నగదుతో ఆయనను సత్కరించారు. షేక్ హుసేన్ సత్యాగ్ని స్పందిస్తూ తన గురుతుల్యులు, స్ఫూర్తి ప్రధాత డాక్టర్ కేతుపురస్కారాన్ని పొందడం జీవితానికి దక్కిన సాఫల్యమేనని అభిప్రాయపడ్డారు. రాజకీయాల వైపు వెళ్లడంతో పూర్తి స్థాయి రచయితగా నిలువలేక పోయామన్నారు. రాజకీయాల్లో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వెంట నడిచిన తృప్తి జీవితానికి గొప్ప ఉపశమనమన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాలకు చెందిన డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి, గంగుల యల్లేశ్వరరావు, ఎస్ఎండీబాషా ముడియం కిశోర్, భూపతి రాయల్ తదితరులను నిర్వాహకులు సత్కరించారు.

సామర్థ్యాల మదింపు.. ప్రతిభ గుర్తింపు

- 3,6,9 తరగతుల విద్యార్థులకు సామర్థ్య పరీక్ష
- నవంబర్ 3న పాఠశాలలో సీస్ సర్వే

కడప ఎడ్యుకేషన్: చదువే అన్నిటికీ మూలం అని ప్రభుత్వం గుర్తించింది. అందుకు తగినట్లుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తూ.. సౌకర్యాలను సమకూరుస్తూ విద్యార్థుల భవిష్యత్ ఉజ్వలంగా, ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కసరత్తు చేస్తోంది.విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ సర్వే 2021లో చేశారు. తిరిగి 2024లో నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే మండలస్థాయిలో చేపట్టనున్నారు. ఈ సీస్ సర్వే నవంబర్ 3వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహిస్తారు. దీని ఆధారంగా విద్యార్థుల విద్యా ప్రమాణాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవచ్చు. అదే సమయంలో ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాన్ని కూడా అంచనా వేయనున్నారు.

- జిల్లాలోని 1361 పాఠశాలల నుంచి సర్వేను నిర్వహించనున్నారు. ఇందులో మొత్తం 33,690 మంది విద్యార్థులు పాల్గొననున్నారు. వీరిలో 3వ తరగతికి సంబంధించి 11102 మంది, 6వ తరగతి వారు 11725 మంది, 9వ తరగతికి సంబంధించి 10863 విద్యార్థుల అభ్యసన ఫలితాల పేరుతో సర్వే చేపట్టనున్నారు. ఇంగ్లీషు మీడియానికి సంబంధించి 27377 మందిని, తెలుగు మీడియానికి చెందిన వారు 5821 మందిని, ఉర్దూ మీడియానికి సంబంధించి 492 మందిని ఎంపిక చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను ప్రత్యేకంగా నిర్వహిస్తున్న పరీక్ష ద్వారా ముదింపు చేయనున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లును చేస్తున్నారు.



సర్వే నిర్వహించే పాఠశాలలు : 1361
విద్యార్థులు : 33690
ఎంపిక చేసిన ఇన్విజిలేటర్లు: 1499
ఎంపిక చేసిన మండల స్థాయి అధికారులు: 68

ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ల ఎంపిక పూర్తి...

సీస్ సర్వేలో భాగంగా క్షేత్రస్థాయిలో పరీక్ష నిర్వహించేందుకు అవసరమైన ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లను విద్యాశాఖ ఎంపిక చేసింది. ఇందులో డైట్, బీఈడీ, డిగ్రీ, పీజీ చేస్తున్న 1499 మంది విద్యార్థులను ఎంపిక చేసింది. డీఈఓ పర్యవేక్షణలో డీసీఈబీ సెక్రటరీ, సమగ్రశిక్ష ఏఎంవో డైట్ ప్రిన్సిపాల్, ప్రభుత్వ పరీక్ష విభాగ అసిస్టెంట్ కమిషనర్ పరీక్షల నిర్వహణ ప్రక్రియను పరిశీలిస్తారు. మండలస్థాయిలో పరీక్ష నిర్వహకులుగా మండల విద్యాశాఖ అధికారులు 1,2 లను కలుపుకుని 68 మందిని నియమించారు.

సిలబస్ ఇదీ: జిల్లావ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 3,6,9 తరగతుల విద్యార్థులకు పరీక్ష ఉంటుంది. 3వ తరగతి వానిరి 3వ తరగతి సిలబస్, 6వ తరగతి ఐదో తరగతి సిలబస్, 9వ తరగతి విద్యార్థులకు 8వ తరగతి సిలబస్‌పై పరీక్ష నిర్వహిస్తారు. 3,6 తరగతి వారికి లాంగ్వేజ్, గణితం, ఈవీఎస్, 9వ తరగతి వారికి లాంగ్వేజ్, గణితం, సైన్స్, సోషియల్ సబ్జెక్టుల్లో పరీక్ష జరుపుతారు. 3, 6 తరగతుల వారు 40 ప్రశ్నలు 60 నిమిషాల్లో, 9వ తరగతి విద్యార్థులు 60 పశ్నలకు 90 నిమిషాల్లో పరీక్ష రాయాల్సి ఉంటుంది.

సామర్థ్యం అంచనా..



సీస్ సర్వే విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల అంచనా వేసేందుకు ఉపకరిస్తుంది. సర్వే ఫలితాలను బట్టి తగిన బోధనా ప్రణాళికలను రూపొందించేందుకు వీలవుతుంది. జిల్లావ్యాప్తంగా ఈ సీస్ సర్వే 1361 స్కూళ్లలో జరగనుంది.
- అంబవరం ప్రభాకర్‌రెడ్డి, జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి

సమర్థవంతంగా నిర్వహిస్తాం



సీస్ సర్వేలో భాగంగా విద్యార్థులకు నిర్వహించే పరీక్షలకు సమర్థవంతంగా నిర్వహిస్తాం. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు, సిబ్బంది నియామకం పూర్తయింది.జిల్లా వ్యాప్తంగా 3,6,9 తరగతులకు సంబంధించి 33690 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.
- ఎద్దుల రాఘవరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి

పవిత్రమాలల సమర్పణ

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి పవిత్ర మాలల సమర్పణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆదివారం టీటీడీ వారి ఆధ్వర్యంలో పవిత్రమాలల సమర్పణ, శాంతి హోమాలు వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య జరిపారు. ఈసందర్భంగా స్వామివారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకొని స్వామి వారిని దర్శించుకున్నారు. అర్చకులు వీరికి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

క్లుప్తంగా

వేధింపుల కేసు నమోదు

కడప అర్బన్ : అదనపు కట్నం తేవాలంటూ.. వేధిస్తుండడంతో ఓ మహిళ తన భర్తపై కడప నగరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేసింది. పోలీసుల వివరాల మేరకు..నకాష్ రిజ్వాన్ నగర్‌లో నివాసముంటున్న షేక్ అజియా పర్వీన్ ప్రొద్దుటూరు ఏపి జీబీలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఈమెకు అన్నమయ్య జిల్లా మదనపల్లె వక్ఫ్ బోర్డు ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తున్న అన్వర్‌హుసేన్‌తో ఐదేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లల సంతానం. ఇటీవల తన భర్త మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని, అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని ఆదివారం పర్వీన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప టూటౌన్ ఎస్ఐ జయరాముడు తెలియజేశారు.

వ్యక్తి ఆత్మహత్య

వేముల : మండలంలోని చింతలజూటూరు గ్రామానికి చెందిన అన్నారెడ్డి బాలస్వామిరెడ్డి (53) ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదులు అందలేదని పోలీసులు తెలిపారు.

పారాణి ఆరకనే నవ వధువు మృతి

పెద్దముడియం : పారాణి ఆరకుండానే నవ వధువు ప్రాణాలు వదిలారు. సందడిగా వివాహం జరిగిందనే సంతోషం ఆమె కుటుంబీకులకు కొద్ది రోజులకే దూరమైంది. విద్యుత్తు షాక్‌తో ఆదివారం వివాహిత మృతి చెందడంతో విషాదం అలుముకుంది.

మండలంలోని జంగాలపల్లె గ్రామంలో ఫిర్దోజ్(20)అనే నవ వధువు విద్యుత్తు షాక్‌తో మృతి చెందింది. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం.. ఫిర్దోజ్‌కు తండ్రి గతంలోనే మృతి చెందారు. తల్లి, సోదరుడు ఉన్నారు. ఈ నెల 10వ తేదీన నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన యువకుడితో వివాహమైంది. ఆదివారం రోజు స్నానం చేయుటకు బాత్‌రూమ్‌లోకి వెళ్లిన ఫిర్దోజ్ అక్కడే పొరపాటుగా హీటర్ తగలడంతో విద్యుత్తు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. వివాహం జరిగి ఐదు రోజులే కావడంతో కుటుంబంలో విషాదం అలుముకుంది. ఎస్ఐ రామక్రిష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

చీటింగ్ కేసు నమోదు

కడప అర్బన్ : ఉద్యోగం ఇస్తానని తనను మోసం చేశాడని మాసాపేటకు చెందిన సయ్యద్ మహబూబ్‌బాషా కడప నగరంలోని టూటౌన్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌కు చెందిన జయ కుమార్‌కు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.2.70 లక్షలు ఇచ్చారని, తర్వాత ఉద్యోగం ఇప్పించక, డబ్బు వెనక్కి ఇవ్వక ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. జయకుమార్‌పై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జయరాముడు తెలియజేశారు.

బైక్ చోరీ

నిమ్మనపల్లె : బైక్ చోరీపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. నిమ్మనపల్లె గ్రామం అగ్రహారం రోడ్డులో నివసిస్తున్న మొరుంపల్లె నరసింహులు తన ద్విచక్ర వాహనాన్ని సెప్టెంబర్ 25న ఇంటి ముందు నిలిపి ఉంచగా, గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకువెళ్లారు. గమనించిన నరసింహులు వివిధ ప్రాంతాల్లో వెదికారు. ఫలితం లేకపోవడంతో ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ జిలానీబాషా తెలిపారు.

ద్విచక్ర వాహనాల చోరీ ముఠా అరెస్టు





అంతర్రాష్ట్ర ముఠా సభ్యుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ కేశప్ప, వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా, స్వాధీనం చేసుకున్న మోటార్‌సైకిళ్లు

- రూ.10 లక్షల విలువచేసే 22 వాహనాల స్వాధీనం
- 8 మంది ముఠా సభ్యులలో ఐదుగురి అరెస్ట్
- ముగ్గురు ప్రధాన నిందితుల కోసం గాలింపు

మదనపల్లె : రోడ్డు పక్కన, ఇళ్ల ఎదుట పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను చోరీలు చేసే అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ కేశప్ప, వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా తెలిపారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు వివరాలను వెల్లడించారు. పట్టణంలోని బెంగళూరు రోడ్డులో వన్‌టౌన్ పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా...కొందరు వ్యక్తులు పోలీసులను చూసి పరారయ్యారు. గమనించిన పోలీసులు వారిని వెంబడించి అదుపులోకి తీసుకుని విచారించడంతో తాము ముఠాలో ఉన్నామని, వారు చేసిన చోరీల గురించి వివరించారన్నారు. వారి నుంచి వివిధ కంపెనీలకు చెందిన 22 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పాత నేరస్థులు కర్నాటక రాష్ట్రం కోలార్ జిల్లా మస్తి మాలూరు హబ్లికి చెందిన కావడి శ్రీనివాస్(35), అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలం బడికాయలపల్లె జింకదాట్లపల్లెకు చెందిన జి.వరదరాజులు(48), మదనపల్లె టౌన్ బసినికొండకు చెందిన షేక్ అజీజ్(42), సత్యసాయి జిల్లా కొక్కంటి తనకల్లు మండలానికి చెందిన షేక్ మహమ్మద్ రసూల్(19), ములకలచెరువు మండలం పాత ములకలచెరువుకు చెందిన కావడిశేఖర్(28), తదితరులు ముఠాగా ఏర్పడి ద్విచక్ర వాహనాల చోరీ ప్రారంభించారన్నారు. నిమ్మనపల్లె, మదనపల్లె వన్, టూ, ముదివేడు, బి.కొత్తకోట, పీలేరు పోలీస్ స్టేషన్లలో వారిపై కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఆదివారం ఐదుగురిని అరెస్టు చేశామని, తమిళనాడుకు చెందిన అరుణాచలంతోపాటు రాజేంద్ర, నరసింహులు పరారీలో ఉన్నారన్నారు. ప్రజలు ద్విచక్ర వాహనాలను రాత్రి వేళల్లో బయట పార్కింగ్ చేసేటప్పుడు వీల్ లాక్, జీపీఆర్ఎస్, సెక్యూరిటీ అలారం అమర్చుకోవాలన్నారు. సెకండ్స్ ద్విచక్ర వాహనాలను కొనుగోలు చేసేవారు వాహనాల దస్త్రాలు పరిశీలించి నిర్ధారించుకున్నాకే కొనుగోలు చేయాలన్నారు. ముఠాను పట్టుకున్న సీఐ ఎస్.మహబూబ్‌బాషా, ఎస్ఐ సి.హరిహరప్రసాద్, కానిస్టేబుళ్లు చక్రపాణిరెడ్డి, వెంకటేశ్వర్లు, ఎస్‌బీ.జైనుద్దీన్లను డీఎస్పీ కేశప్ప అభినందించారు.

పాత్రికేయులకు క్రీడలు అవసరం

పులివెందుల టౌన్ : నిత్యం మానసిక ఒత్తిడికి గురవుతూ విధులు నిర్వహించే పాత్రికేయులకు క్రీడలు చాలా అవసరమని వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి డా.వైఎస్.అభిషేక్‌రెడ్డి అన్నారు. పులివెందుల వైస్.రాజశేఖర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి జర్నలిస్టుల షటిల్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్రీడల్లో ఉత్సాహం చూపుతూ ముందుకు పోవాలన్నారు. రాష్ట్ర స్థాయి షటిల్ టోర్నమెంట్‌లో పులివెందుల విజయం సాధించడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన పులివెందుల, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లా జట్లకు మెమెంటోలు, షీల్డు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, పౌరసరఫరాల శాఖ రాష్ట్ర డైరెక్టర్ గంగాధరరెడ్డి, జేసాప్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, రమణారెడ్డి, శ్రీనాథరెడ్డి, సీఐ బాలమద్దిలేటి, ఎస్సై రవికుమార్, జర్నలిస్టులు, తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు మెమెంటోలను అందజేస్తున్న వైఎస్ అభిషేక్‌రెడ్డి, తదితరులు

పొగమంచు కమ్మేసింది..

గుర్రంకొండ : వేసవిని తలపించే వేడిమితో ఉక్కపోత భరించలేక వైఎస్సార్ జిల్లాలో జనం అల్లాడుతున్నారు. ఇందుకు భిన్నంగా అన్నమయ్య జిల్లా గుర్రంకొండ ఎన్‌హెచ్ 340 జాతీయ రహదారిలో పొగమంచు కమ్మేయడం ఆకట్టుకుంటోంది. రాత్రి పొగమంచు కమ్ముకుని విచిత్రమైన వాతావరణ పరిస్థితి కనిపిస్తోంది. వాహనాలు కనపడక తెల్లవారుజామున లైట్లు వేసుకుని వెళ్తున్నారు.



గుర్రంకొండలో పొగమంచు కమ్మేయడంతో రోడ్డుపై లైట్లు వేసుకొంటూ వాహనాలు నడపుతున్న దృశ్యాలు

ప్రజల సమస్యలను పరిష్కరిస్తాం

రాజంపేట : ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ముందుంటామని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. సుండుపల్లె మండలం కేతిరెడ్డిపల్లెకు చెందిన 70 మంది టీడీపీ నేతలు ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక మేడా భవన్‌లో ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చూసి కరుడు కట్టిన తెలుగుతమ్ముళ్లు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారన్నారు. స్కిల్ స్కాం కుంభకోణంలో చంద్రబాబునాయుడు జైలుపాలయ్యారని, టీడీపీ పార్టీ జనంలో అపహాస్యం పాలైందని అన్నారు. అనంతరం అదే భవనంలో ఆయన ప్రజా దర్బార్ నిర్వహించారు. ఆరు మండలాల నుంచి వచ్చిన జనంతో ఆప్యాయంగా మాట్లాడుతూ వినతులను స్వీకరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుండుపల్లె మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీలోకి చేరిన టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేతలతో ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

ముస్లింల అభ్యున్నతికి కృషి

- కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి
- ప్రభుత్వ ఖాజీగా సయ్యద్ జాహిద్‌కు పత్రాల అందజేత
- వైఎస్సార్‌సీపీలో చేరిన 300 కుటుంబాలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

కమలాపురం : ముస్లింల అభ్యున్నతి కోసం నాడు మహానేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి నాలుగు శాతం రిజర్వేషన్ కల్పిస్తే, నేడు ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అడుగు ముందుకేసి పఠాన్, సయ్యద్‌లకు సంక్షేమ పథకాలదించి బాసటగా నిలిచారని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక తాళం వద్ద 16, 17, 18, 19, వార్డులకు చెందిన యువ నాయకులు సయ్యద్ హసన్‌బాషా, సయ్యద్ జాహిద్ హుసేన్, గయాసుద్దీన్, షాహుల్ హమీద్, రహమత్ అలీ, చాన్‌బాషా, ఖాజాపీర్, మరో 300 కుటుంబాలు ఆదివారం వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకోగా.. ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఖాజీగా సయ్యద్ జాహిద్ హుసేన్‌కు నియామక పత్రాలు అందజేశారు. అనంతరం ఖాజీ కార్యాలయాన్ని సీకే దిన్నె జడ్పీటీసీ సభ్యుడు నరేన్ రామాంజులరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లిం కుటుంబాల ఖాతాల్లో రూ.30 వేల కోట్లు జమచేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.160 ఏళ్ల చరిత్ర కలిగిన కమలాపురం దర్గాలో రూ.2.5 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. వక్ఫ్ బోర్డు ద్వారా 25 గదుల నిర్మాణం చేపడతామన్నారు. 11 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఖాజీ నియామకంపై డిప్యూటీ సీఎం అంజద్‌బాషా సీఎం జగనన్న దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరించానన్నారు. 369 సర్వే నెంబర్‌లో భూ సమస్య పరిష్కరించాలని, ఉర్దూ జూనియర్ కళాశాల ఏర్పాటుచేయాలని ముస్లిం నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నరేన్ రామాంజులరెడ్డి మాట్లాడుతూ ఏపీలో ముస్లింలకు అనేక పథకాలున్నాయని, కడపకు చెందిన ఓ ముస్లిం విద్యార్థి రు.1.40 కోట్లు లబ్ధి పొందారన్నారు. గత ప్రభుత్వం ఓట్ల కోసం ముస్లింలను వాడుకున్నారని, జగనన్న ప్రభుత్వం ముస్లింలకు రాజ్యాధికారం ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, మహ్మద్‌సాధిక్, ఎస్‌సీ.పుల్లారెడ్డి, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, చెన్నకేశవరెడ్డి, ఆర్‌వీఎస్ఆర్, ఇర్ఫాన్, ఖాజా హుసేన్, ఖాజాపీర్, ఖాద్రి, నిఖిల్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, యువ నాయకులు ఇస్మాయిల్, హిదాయత్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

కురబ సంఘ సమావేశంలో ఉద్రిక్తత



హార్సిలీ హిల్స్‌పై రోడ్డుపైనే ఉండిపోయిన కురబ సంఘం నాయకులు



లింగప్రసాద్ కారు అద్దాలు పగిలి కారులో పడిన రాయి

బి.కొత్తకోట : కురబ సంఘం రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక వ్యవహారం కొంతసేపు ఉద్రిక్తతకు దారితీసింది. బి.కొత్తకోట మండలంలోని హార్సిలీ హిల్స్‌లోని ఓ భవనంలో కురుబ సంఘం సమావేశం నిర్వహణకు ముందస్తుగా ఏర్పాట్లు చేసుకున్నారు. ఆదివారం సమావేశం ప్రారంభమయ్యే సమయంలో జె.శ్రీనివాసులు అభిమానులమని చెప్పుకొంటూ కొందరు యువకులు వచ్చి తమ నాయకుడు లేకుండా ఈ సమావేశం నిర్వహించడానికి వీల్లేదని పట్టుబట్టారు. దీంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. సంఘ నాయకులు, సభ్యులు భవనంలోకి వెళ్లకుండా రోడ్లపైనే ఉండిపోయారు. దీంతో సంఘం నాయకులు బి.కొత్తకోట ఎస్ఐ రామ్మోహన్‌కు పరిస్థితి వివరించడంతో పోలీసులు చేరుకుని సంఘానికి చెందిన వ్యక్తులు కాకపోయినా ఎలా అడ్డుకుంటారంటూ అడగడంతో యువకులు వెనకడుగు వేశారు. అనంతరం కురబ సంఘ సమావేశం నిర్వహించి రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక పూర్తి చేశారు. అనంతరం నూతన సభ్యులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు, అనంతపురం, ఏలూరు, ప్రకాశం, కృష్ణా, గుంటూరు, చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల నాయకులు హాజరయ్యారు.

కార్లపై దాడి

జిల్లా నాయకులు వెనుదిరిగి వెళ్లిన అనంతరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుల్లె రెడ్డిప్రసాద్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు లింగప్రసాద్ తదితరులు కొండపైనే ఉండిపోయారు. వారి కార్లను రోడ్డుపైనే నిలిపి ఉంచారు. గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లతో దాడి చేయడంతో కార్లు ధ్వంసమయ్యాయి. ఎస్ఐ రామమోహన్ దృష్టికి తీసుకెళ్లగా, ఏఎస్ఐ బొజ్జే నాయక్, పోలీసులు ఘటనా స్థలం చేరుకుని కార్లను పరిశీలించారు. కొండపై అధికసంఖ్యలో ఉన్న పర్యాటకులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రశాంతతకు మారుపేరైన హార్సిలీ హిల్స్‌పై ఇలాంటి ఘటనలు పునరావృత్తమైతే పర్యాటకులకు ఇబ్బందులు తలెత్తుతాయని స్థానికులు తెలిపారు.

నవంబర్ 19న మాల మహానాడు రజతోత్సవం



సమావేశానికి హాజరైన నాయకులు

మదనపల్లె : మాలమహానాడు స్థాపించి 25 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా నవంబర్ 19న మదనపల్లెలో మాల మహానాడు రజతోత్సవం నిర్వహిస్తున్నట్లు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు యమలా సుదర్శన్ తెలిపారు. పట్టణంలోని మిషన్ కాంపౌండ్‌లో ఆదివారం ఉమ్మడి జిల్లాల నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాలమహానాడు ఆవిర్భావం, సాధించిన విజయాలు, బడుగు, బలహీన వర్గాలకు బాసటగా నిలిచిన వైనం, రజతోత్సవాల నిర్వహణ, కార్యాచరణపై చర్చించారు.

చెలరేగిన చిత్తూరు బ్యాట్స్‌మెన్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో చిత్తూరు బ్యాట్స్‌మెన్ సెంచరీతో చెలరేగిపోయారు. కడప నగరంలోని కేఎస్ఆర్ఎం మైదానంలో ఆదివారం నిర్వహించిన మ్యాచ్‌లో నెల్లూరు, చిత్తూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన చిత్తూరు జట్టు 48.3 ఓవర్లలో 219 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో వై.తేజారెడ్డి 147 బంతుల్లో 15 ఫోర్లు, 5 సిక్సర్లతో 126 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 39 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 129 పరుగులు చేసింది. జట్టులో సోహన్‌వర్మ 52 పరుగులు చేశాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.



126 పరుగులు చేసిన చిత్తూరు బ్యాట్స్‌మన్ తేజారెడ్డి



కేఎస్ఆర్ఎం మైదానంలో తలపడుతున్న చిత్తూరు, నెల్లూరు జట్లు

కేఓఆర్ఎం మైదానంలో..

కేఓఆర్ఎం మైదానంలో అనంతపురం, కర్నూలు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన బ్యాటింగ్ ఎంచుకున్న అనంతపురం జట్టు 76 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 284 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. రోహిత్ రోషన్ 60 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 12 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 26 పరుగులు చేసింది. నయీముల్లా 22 పరుగులతో క్రీజులో ఉన్నాడు. తొలిరోజు ఆట ముగిసింది.

జేసీబీ దొంగ అరెస్ట్

మదనపల్లె : పట్టణంలోని సీటీఎం రోడ్డులో నిలిపిన జేసీబీని చోరీ చేసిన నిందితుడిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ కేశప్ప తెలిపారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివరాలు వెల్లడించారు. నిమ్మనపల్లె మండలం జాండ్ర బైలు గ్రామానికి చెందిన మల్లంపల్లె రెడ్డిశేఖర్(25) జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తి జేసీబీని పీకేఎం రోడ్డులో ఉంచగా, ఈ నెల 12న చోరీకు గురైందన్నారు. విచారిస్తున్న పోలీసులు ఈ నెల 13న మండలంలోని తట్టివారిపల్లె జంక్షన్ వద్ద జేసీబీని తీసుకువెళుతున్న నిందితుడు రెడ్డి శేఖర్‌ను అరెస్ట్ చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ మహబూబ్‌బాషా, హెడ్‌కానిస్టేబుల్ రామమూర్తి పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

రామాపురం : మండల పరిధి రిలయన్స్ పెట్రోల్ బంక్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. రాయచోటికి చెందిన షేక్ రెహాన్, తోహత్ కలిసి టీ తాగడానికి కర్నూలు-చిత్తూరు రహదారిలోని ఐరిస్ గ్రాండ్ హోటల్ వద్దకు ద్విచక్ర వాహనంలో వస్తున్నారు. రిలయన్స్ పెట్రోల్ బంక్ సమీపంలోకి రాగానే కడప వైపు నుంచి వస్తున్న కంటెయినర్ లారీ ఢీ కొంది. రెహాన్(18) అక్కడిక్కడే మృతి చెందగా, తోహత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకుని ఎస్ఐ కొండారెడ్డి చేరుకుని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం తరలించారు. రెహాన్ పట్టణంలోని గాంధీ బజార్‌లోని అన్వర్ గ్రాఫిక్‌లో పనిచేస్తున్నట్లు సమాచారం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఓబులవారిపల్లె : మంగంపేట జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. రైల్వేకోడూరు మండలం నారాయణరాజు పోడు గ్రామానికి చెందిన నాగరాజు మంగంపేటలో పనులు ముగించుకుని స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నారు. దారి మధ్యలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి..

మదనపల్లె : మండలంలోని సీటీఎం రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే ట్రాక్ పక్కన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించడంతో స్థానికులు రైల్వే పోలీసులకు తెలిపారు. కదిరి రైల్వే కానిస్టేబుల్ మహబూబ్‌బాషా, సిబ్బంది కలిసి స్థలానికి చేరుకుని విచారించారు. మృతుడి జేబులో ఈ నెల 12న కొనుగోలు చేసిన చెన్నై-అరక్కోణం రైల్వే టికెట్ లభించింది. మృతుడికి 40 ఏళ్ల వయస్సు ఉంటుందని హెడ్ కానిస్టేబుల్ చెప్పారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ట్రాక్టరు ఢీకొని

కలికిరి : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన కలికిరి పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పుంగనూరు పట్టణానికి చెందిన సురేష్(30) తన భార్య అనితతో కలిసి ఇందిరమ్మకాలనీలో నివాసముంటున్నాడు. ప్రైవేటు డ్రైవర్‌గా పనిచేస్తున్న సురేష్ ఆదివారం మధ్యాహ్నం చింతపర్తికి వెళ్లి ద్విచక్రవాహనంపై వస్తుండగా తిరుమలబండ వద్ద ట్రాక్టరు ఢీకొని తలకు తీవ్రగాయాలవడంతో అక్కడే పడిపోయాడు. అటుగా వెళ్తున్న రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ తన వాహనాన్ని ఆపి క్షతగాత్రున్ని పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించుకుని పోలీసులకు సమాచారమిచ్చాడు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మధుసూదనాచారి తెలిపారు.

హోరాహోరీగా హ్యాండ్‌బాల్ పోటీలు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డీఎస్ఏ క్రీడా మైదానం వేదికగా ఏపీ హ్యాండ్‌బాల్ రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళలు, అండర్-19 బాలుర విభాగం చాంపియన్‌షిప్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారులు చక్కటి ఆటతీరు కనబరిచారు. జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. చిన్నపరెడ్డి, తిరుమల టింబర్ డిపో అధినేత కంచి గోపీకృష్ణ, కంచి సురేంద్రనాథ్ క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంచి సురేంద్రనాథ్, వి.వి. శివప్రసాద్, వెంకట సునీల్, ఎ. సింధూరి, బాబర్, బసిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు..

హ్యాండ్‌బాల్ అండర్-19 విభాగంలో నిర్వహించిన మ్యాచ్‌లలో కడప జట్టు తూర్పుగోదావరి జట్టుపై, పశ్చిమగోదావరి జట్టు శ్రీకాకుళంపై, శ్రీకాకుళం జట్టు తూర్పుగోదావరిపై, పశ్చిమగోదావరి జట్టు కడపపై, చిత్తూరు జట్టు ప్రకాశంపై, వైజాగ్ జట్టు కృష్ణాపై, విజయనగరం జట్టు కర్నూలుపై విజయం సాధించాయి. అనంతరం నిర్వహించిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో విజయనగరం జట్టు గుంటూరుపై విజయం సాధించి సెమీ ఫైనల్‌కు చేరింది.

- సీనియర్ మహిళల విభాగంలో నిర్వహించిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లలో విజయనగరంపై కృష్ణా జట్టు, కడప జట్టు తూర్పుగోదావరిపై, వైజాగ్ జట్టు చిత్తూరుపై విజయం సాధించి సెమీ ఫైనల్‌కు చేరాయి.



రసవత్తరంగా సాగుతున్న రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

దళితులపై దాడి: నాయకుల పరామర్శ

రాజంపేట : తమ గ్రామంలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు ఉండరాదంటూ బాబు సామాజిక వర్గానికి చెందిన కొందరు దళితులపై దాడి చేయించిన సంఘటన స్థానిక కొమ్మివారిపల్లె కాలనీలో ఆదివారం చోటుచేసుకుంది.

స్థానికుల వివరాల మేరకు.. తాము వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నందున చిన్న కారణాలతో గొడవలకు దిగేందుకు టీడీపీ నేతలను కొందరు రెచ్చగొడుతున్నారని కొమ్మివారిపల్లె కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూపతిపరుడు గుంటుమణి తెలిపారు. ఆదివారం ఏ కారణం లేకుండానే దళితులు శంకరయ్య, సుబ్బయ్య, రామ్మోహన్, ఆది, మహేంద్ర, గంటుశేఖర్‌లపై దాడిచేసి గాయపరిచారన్నారు. వారిని చికిత్స నిమిత్తం రాజంపేట ప్రాంతీయ వైద్యశాలకు తీసుకొచ్చామన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. సోదరభావంతో మెలిగే దళితుల మధ్య చిచ్చుపెడుతూ ఇబ్బంది పెడుతున్నారని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండుగోపి, జడ్పీటీసీ సభ్యుడు దాసరి పెంచలయ్య, జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు సత్యాల రామకృష్ణ అన్నారు. గాయపడిన దళితులను ఆదివారం వారు పరామర్శించి ధైర్యం చెప్పారు. టీడీపీ నేతల మాటలు విని తమ జీవితాలు నాశనం చేసుకోరాదని హితవు పలికారు.



గాయపడిన దళితులను పరామర్శించిన వైఎస్సార్‌సీపీ జిల్లా దళిత నేతలు దండు, దాసరి, సత్యాల్